


# మెమెమో నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

## వేగం

అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా అనేక దేశాలనించి తొమ్మిది ఏళ్ళ వయసుగల పిల్లలు అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి. కి వెళ్ళారు.

ఇండియా నించి రాజేష్ అనే తొమ్మిదేళ్ళ పిల్లవాడిని ఎన్నిక చేశారు. అతని తండ్రి ఇలాంటి సాంస్కృతిక వ్యవహారాలు చూసే శాఖలో ఉద్యోగంలో వుండబట్టే రాజేష్ తేలికగా ఎన్నిక అయ్యాడు. రాజేష్ వారం రోజులపాటు వాషింగ్టన్‌లో వుండడానికి చిన్న సూట్‌కేస్ తో చేరుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ ఏర్ పోర్ట్‌లో ఓ యువతి రిసీవ్ చేసుకుంది.

ఆ రోజు సాయంత్రం వివిధ దేశాలనించి వచ్చిన పిల్లలందరికీ ఓ టాపిక్ యిచ్చి దానిమీద మాట్లాడమన్నారు.

ఆ టాపిక్ 'మా నాన్నగారు ఎందుకు గొప్పవారంటే'.

చైనా నుంచి వచ్చిన చిన్ లున్ అనే పిల్లవాడు ముందుగా మైక్ ముందుకి వెళ్ళి ఇలా అన్నాడు..

"మా నాన్న గారు అత్యంత వేగంగా పరిగెత్తగలరు. ఎంత వేగంగా అంటే ఆయన బాణం వేసి, పరిగెత్తుకెళ్ళి అది గుచ్చుకునే చోటికి బాణం కన్నా ముందే చేరుకోగలరు."

తర్వాత ఆస్ట్రేలియా నించి వచ్చిన ఆల్బర్ట్ అనే పిల్లవాడు చెప్పాడు.

" మా నాన్న గారు కూడా పరిగెత్తే విషయంలో గొప్పవారు. ఆయన తుపాకి పేల్చి, పరిగెత్తుకెళ్ళి గుండు గుచ్చుకునే లోగా ఆ చోటికి చేరుకోగలరు."

ఇండియా నుంచి వచ్చిన రాజేష్ వంతు వచ్చింది. మైక్ ముందు నిలబడి రాజేష్ ఇలా చెప్పాడు.

"మా నాన్న గారు ఇంకా వేగం. ఆయన ఆఫీసు టైమ్ సాయంత్రం అయిదు గంటలవరకూ ఆఫీసులో ఉండి కూడా మా ఇంటికి రోజూ ఖచ్చితంగా మూడు గంటలకల్లా చేరుకోగలరు."

## జల్సా..జల్సా..జల్సా..! యర్రంశెట్టి శాయి



"మీ స్నేహితుడు చెట్టుమీద నుంచి కిందపడి చనిపోయాడట గదా?"

"అవును.."

"పాపం! ఎక్కకుండా ఉంటే ఇలా ప్రాణంమీదకొచ్చేది కాదు కదా!"

"అవును"

"ఇంతకూ  చెట్టెందుకెక్కినట్లు?"

"ఉరేసుకోడానికి తాడు కట్టబోయాడు.."

***

రమాపతీ, సీతాపతీ హైద్రాబాదెళ్ళి మొదటి సారిగా సిటీబస్సెక్కారు. ఖాకీ బట్టలేసుకున్న ఒక వ్యక్తిచేతిలో రూపాయి నోటుంచి "రెండు టిక్కెట్లు కోటీ కివ్వండి" అనడిగాడు రమాపతి.

ఖాకీ బట్టలతను నవ్వి "నేను టాక్సీ డ్రయివర్ని!" అన్నాడు రూపాయి తిరిగి ఇచ్చి వేస్తూ. వెంటనే బస్ లో నుంచీ రమాపతీ, సీతాపతి కిందకు దూకేశారు.

"బస్సనుకుని మనం టాక్సీ ఎక్కేశాం చూశావా?" అన్నాడు పతి బట్టలు దులుపుకుంటూ.

***

స్కూళ్ళ ఇన్స్పెక్టర్ గారు ఒక స్కూలు ఇన్స్పెక్షన్ చేసేస్తున్నారు.



ఆరో క్లాసులో ఒక కుర్రాడిని "రామాయణం ఎవ్రాశారోయ్" అంటూ ఠకీమని అడిగాడు.

ఆ కుర్రాడు కంగారుపడిపోయాడు. " నేన్రాయలేదండీ.." అన్నాడు భయంగా.

ఇన్స్పెక్టర్ కి కోపం వచ్చేసింది.

"ఇదన్న మాట నువ్వు పిల్లలకి చెబుతోంది?" అన్నాడు పంతులుతో.

ఆ పంతులు మరీ కంగారు పడిపోయాడు.

"అబ్బే భయం కొద్దీ వాడలా అంటున్నాడండీ.. నిజానికి వాడే రాశాడు!" అన్నాడు  దీనంగా.

ఇది విని ఇన్స్పెక్టర్ మరీ మండిపోయాడు.- సరాసరి హెడ్మాస్టర్ గదిలోకెళ్ళి గావు కేకలేశాడు.

"ఇదీ మీస్కూల్లో పరిస్థితి! రామాయణం ఎవ్రాశారో కూడా ఎవ్వరికీ తెలీదు.!" అన్నాడు.

హెడ్మాస్టర్ నొచ్చుకున్నాడు. నిజంగా అలాంటి సమాధానాలు రావడం, అందులోనూ బాధ్యతగల పంతులే  రకంగా చెప్పడం సిగ్గుచేటని

ఒప్పుకున్నాడు.

" ఈ సారికి క్షమించండి సార్! నేను స్వయంగా  క్లాసుకెళ్ళి అది ఏ కుర్రాడు రాశాడో తెల్సుకుని ఇంకెప్పుడూ రాయనని వాడి దగ్గర హామీ తీసుకుని -  రిపోర్టు మీకు రేపే పంపిస్తాను!" అన్నాడు.

ఇన్స్పెక్టర్ తల రెండు చేతుల్తో పట్టుకున్నాడు. "అ అయితే  రామాయణం వాల్మీకి రాసినట్లు మీకూ తెలీదన్నమాట!" అన్నాడు ఆశ్చర్యంగా.

"వాడా వాల్మీకి గాడా? వాడు ఫోర్తు ఫారం 'బి' సెక్షన్లో ఉన్నాడండీ.. కానీ వాడెప్పుడూ అలాంటి పనులు చేయడే.!" అన్నాడు హెడ్మాస్టారు పేము బెత్తం తీసుకుని ఫోర్త్ ఫారం 'బి' సెక్షన్ కేసి నడుస్తూ.

***

ఓ అమాయకపు అరుణాచలం సినిమా హాలు నుంచి రోడ్డుమీద కొస్తుంటే సింహాచలం పలుకరించాడు.

"ఏమోయ్ సినిమా నుంచా?"

"కాదు! మా అమ్మాయి ఎవడితోనో రిక్షాలో వెళుతూ కనిపించింది. ఎక్కడికెళుతున్నారా అని వెంబడించాను. ఇద్దరూ ఈ హాల్లో సినిమాకెళ్ళారు. ఈ సినిమా ఏమో నేనిదివరకు చూసిందానాయె! అందుకని తిరిగి వచ్చేస్తున్నాను.." తేలిగ్గా చెప్పాడు అరుణాచలం.

***

వెంకట్రామయ్య గారి కారు బురదగా వున్న రోడ్డుమీద గుంటలో దిగబడిపోయింది.  పక్కనే ఇంట్లో ఉన్న రైతు తన ఎద్దులను తీసుకొచ్చి కారుకి తాడు కట్టి కారుని బయటకు లాగాడు. అతని సహాయానికి పదిరూపాయలు ఇచ్చారు వెంకట్రామయ్య గారు.

"పాపం రాత్రింబగళ్ళు ఈ గుంటలో దిగబడే కార్లకు నువ్వు సహాయం చేస్తూనే వుండాల్సి వస్తుందేమో! కదూ.." అడిగారాయన.

"అబ్బే రాత్రిళ్ళు  బురద ఎండిపోకుండా నీళ్ళు తెచ్చి తడుపుతూ ఉండాలి కదండీ..  గుంట పూడిక తీస్తుండాలి అప్పుడప్పుడూ.."

***

# చౌ చౌ



జంబులింగం పట్నం వెళ్ళడం అదే మొదటి సారి. సూపర్ మార్కెట్లో అడుగుపెట్టాడు..

"ఇదేమిటండీ.."

"అది ఆరెంజ్ జ్యూస్ పౌడర్. దాన్ని నీళ్ళలో కలిపితే ఆరెంజ్ జ్యూస్ తయారౌతుంది.."

"మరిదీ..?"

"అది మిల్క్ పౌడర్. " " అంటే దాన్ని నీళ్ళలో కలిపితే మిల్క్ ఔతుంది కదా.."

"అవునండీ.."

"ఇదో?"

"అది బేబీ పౌడర్.."

"అయితే దీన్ని నీళ్ళలో కలిపితే బేబీ వస్తుందన్నమాట..ఓ నాలుగు డబ్బాలివ్వండీ.. మా వూళ్ళో అందరికీ చూపించాలి.." జంబులింగం తొందరపెట్టాడు..

***

"ఏరా ఆనంద్..నీ భార్యకు  కొత్త ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తున్నావట గదా.. ? డాక్టర్‌కి ఇదే మొదటి కేసు  తెలుసా?"

"పోనీలేరా.. ఆపరేషన్ సక్సెస్ అయితే అదృష్టం అతడిదీ..కాకపోతే నాదీ.."

***

రాత్రి సమయం..జంబులింగం భార్య జాంబవతి " ఏమండీ..రాత్రి ఎంత ప్రశాంతంగా ఉందో.. నేను పాట పాడుతాను..మీరు తాళం వెయ్యండి.." అంది

"తాళం ఎప్పుడో వేసేసాను. ఇక ఎవ్వరూ రారు. నువు పాడటం మొదలెట్టు.." అన్నాడు జంబులింగం ధీమాగా.

***

జాంబవతి తన భర్త జంబులింగం గురించి పక్కింటావిడకి ఇలా చెబుతోంది..

"మా ఆయనకు దురలవాట్లేమీ లేవు తెలుసా? పేకాట ఆడరు..తాగరు.. చీకటి పడేలోపే ఇంటికి చేరతారు.."

పక్కింటావిడ వెక్కిరింతగా " సిగిరెట్లు కూడా తాగరా?" అంది.

"తాగుతారనుకో.. సుష్టుగా, తృప్తిగా భోంచేసినప్పుడు ఈ సిగరెట్ తాగందే తోచదంటారు. అంటే ఏడాదికి ఒకటి రెండు సార్లు అన్నమాట. అదేమైనా పెద్ద అలవాటా?"

***



జంబులింగానికీ, జాంబవతికీ పెద్ద గొడవ మొదలైంది..

జాంబవతి పెద్దగా అరుస్తోంది..

"మీ వల్ల తప్పుంటే మీరు పోతారు.. నావల్ల తప్పుంటే నా పసుపు కుంకుమే పోతుంది.."

***

"మా ఆవిడ సమస్తమూ తీసుకుని నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయిందిరా" విచారంగా అన్నాడు రామలింగం.

"నువ్వు అదృష్టవంతుడివిరా.  ఆవిడైతే సమస్తం తీసుకుంది. అయినా ఇప్పటికీ నన్ను వదిలి పెట్టలేదు.." అన్నాడు జంబులింగం.

***

జంబులింగం, జాంబవతిని తీసుకుని సరదాగా పట్నంలో సినిమా చూద్దామని వెళ్ళాడు. సినిమాకి ఇంకా టైముందని పక్కనే ఉన్న కేఫ్ కెళ్ళి కాఫీ ఆర్డరిచ్చాడు.. జాంబవతి వేడి కాఫీని ఊదుకుంటూ నెమ్మదిగా తాగుతోంది..

"తొందరగా..తొందరగా తాగు.." అన్నాడు జంబులింగం.

"ఎందుకండీ..అలా తొందర చేస్తున్నారు?" అంది జాంబవతి..

"పిచ్చి మొహమా అక్కడ బోర్డు చూడు..హాట్ కాఫీ ఐదు రూపాయలు..కోల్డ్ కాఫీ పది రూపాయలు అని లేదూ.. "

***